# ఈ బాకీ తీరనిది!

★

* రచన : శ్రీ దేవరాజు రవి *



కుటుంబ నియంత్రణ పాటించని దేశంలావుంది రైలు. స్టేషన్ స్టేషన్‌కీ జనం ఎక్కువౌతున్నారేగాని, ఒక్కరూ దిగే సూచన కనబడ్డం లేదు.

అయితే నాకేం బాధలేదు. దర్జాగా నాకు సీటు దొరికింది. నా జాగాలో కొంచెంకొంచెం బక్కరుదామని, దురాక్రమణ చేద్దామని, చాలామంది కుట్రలు చెయ్యకపోలేదు అయితే, నేనా లొంగేది?

ఇంత రద్దీలోనూ, అమ్ముకునేవాళ్ళు మాత్రం అతి చాకచక్యంగా, అతి వొడుపుగా ఇటూఆటూ తిరిగేస్తున్నారు.

ఇంతలో టీసీ వచ్చాడు. నా ఎదురు సీట్లో కూర్చున్న ఓ పాతికేళ్ళ హిందుస్థానీ పడుచు లేచి, లేవటరీ వేపు నడిచింది. ఆవిడ, లేవడమే తడవుగా, ఓ మహమ్మదీయ సోదరుడు ఆ జాగాలో టోపీ సవరించుకుంటూ కూర్చున్నాడు.

'ఇదేవిటీ...ఆ అమ్మాయి తిరిగిరాదా? ఇలా వీడు దురాక్రమణ చేశాడేవిటి చెప్మా?' అనుకున్నాను.

టీసీ మా సీట్లు దాటి ముందుకు వెళ్ళాడు. ఓ పావుగంటకు ఆ యువతి తన సీటుదగ్గరికి వచ్చింది. ఎవరో కూర్చునివుండడం చూసి, ఏమీ అనలేక చిత్తరపోయి నిల్చుండిపోయింది. అందరివేపూ జాలిగా చూసింది.

పాపం, నాప్రక్కన కూర్చున్న తలపాగా నాయుడుగారు, బహుశ, జాలి ఎక్కువేమో—ఆటోపీవాలాతో—

'బాబూ...ఈ పిల్ల ఇక్కడ కూర్చుంది. నువ్వు కాస్త లేచిపోమ్మా...' అన్నాడు.

వాడు కిమ్మనలేదు, ఎంతైనా వాడు కూర్చున్నది ఆమె సీట్లో అంచేత అంతా వాడిమీద ఉగ్రులైనారు.

ఎంతైనా ఆ టోపీవాలా కదల్లేదు. ఆ పిల్లమాత్రం అలా నిల్చునేవుంది.

'ఆ...ఎవరికావాలండీ...వేడివేడి జంతికలు... కాలక్షేపం జంతికలు...ఆ బాబూ...మీకావాలాండీ ...వామ్ వేసి చేశాం సార్...పావలాకి ఆరు...' అంటూ రంగంలోకి ప్రవేశించాడు జంతికల మాంత్రికుడు.

'అమ్మో...అమ్మో...నా కాలు తొక్కేశాడు నాయనోయ్ మాయముండావాడు...వీడి కాళ్ళిరిగిపోనూ ...వీడి నోరుపడిపోను...' అంటూ సీటు చివర కూర్చున్న బామ్మగారు విరుచుకుపడ్డారు, ఆ జంతికలాయనమీద.

గాభరాగా అంతా అటు చూశాం, జాలి హృదయుడైన నాయుడుగారు, లేచి మరీ వెళ్ళి, ఆవిణ్ని పరామర్శించి, జంతికలాయన గొంతు నొక్కినంతపని చేసి, మళ్ళా తన సీట్లోకి వస్తూ నిలబడ్డ ఆ పడుచుపిల్లను గుద్దుకున్నాడు, ఆమె తొట్రుపడి ఆ టోపీవాలామీద పడబోయి, నిలదొక్కుకుంది.

అలా పడబోవడంలో ఏం తమాషా జరిగిందో ఏమో గాని, టోపీవాలా, ఈ పడుచుదానికి కాస్త జాగా ఇచ్చాడు, వాళ్ళిద్దరి భుజాలు దోబూచులాడుకుంటున్నాయి.

ఇదిచూడగానే నా మనస్సు చివుక్కుమంది. వెధవ—మంచి ఛాన్సుకొట్టేసాడే అని గొణుక్కున్నాను. నేనే ఆమెకు ఆ కాస్త జాగా ఇచ్చివుంటే, ఈబుజాల రాపిడి ఛాన్సు నాకే దొరికివుండును కదా—అని బాధపడ్డాను.

ఒక్కొక్కసారి అంతే, బొద్దుబుర్ర, అయిడియాలు వచ్చి చావవ్, తీరా ఎవడో చేసేసేటప్పటికి చెప్పలేనంత ఉక్రోషం ముంచుకవస్తుంది, చేతకాని వాడికి శౌర్యం ఎక్కువట.

నిజమే! నేను చేతకానివాడినే! అందులో అనుమానం ఏంవుంది? చిన్నప్పుడే నాన్న పోయాడు. ఎక్కువ చదువుకునేందుకు అవకాశం కుదరలేదు, ఏదో స్కూలు ఫైనల్ అయిందనిపించేసరికే, అమ్మ అలిసిపోయింది. నాకేం తోచలేదు. ఎంత చిన్న ఉద్యోగమైనా దొరుకుతుందేమో అని అనేక ప్రయత్నాలు చేశాను. ఏదీ ఫలించలేదు, నేను కన్నతల్లికి రెండు పూటలా పిడికెడు అన్నం పెట్టలేని అసమర్థుణ్ని అయాను.

నాకోసం అమ్మ ఇళ్ళల్లో వంటలే చేసిందో, నీళ్ళే మోసిందో, హోటళ్ళలో చాకిరీనే చేసిందో—ఇవన్నీ నాకళ్ళారా నేను చూసిందే! అయితే, ఇవాళ అమ్మ కాలూ, చెయ్యీ రాక మంచానపడివుంటే, నేను ఎందుకూ కొరగాకుండాపోయాను.

ఆమెకోసం నేను ఏమైనా చెయ్యాలి, ఏంచేసినా అది ఆమె త్యాగంకన్న గొప్పది కాదు, ఆమె నాకోసం పడ్డ కష్టాలకన్న ఎక్కువేం కాదు, ఏ కొడుకూ, తన తల్లి ఋణాన్ని, ఎన్ని జన్మలకైనా తీర్చుకోలేడు, ఆ బాకీ తీరనిది!

ఏదో చిన్న ఉద్యోగంవుందనే వార్తవిని, కొండంత ఆశతో ఇలా బయలుదేరాడుతను.

'ఖాళీచేతుల్తో బయలుదేరితే, నీ ముఖం చూసేవాడెవడ్రా? కనీసం ఓ వంద అయినా బరువులేందే, నీ అప్లికేషన్ అయినా ఆనర్ చేస్తార్రా?' అని అన్నాడు బయలుదేరేముందు మిత్రుడు మోహన్.

'...కాదు, కాళ్ళావేళ్ళా పడతాను. వెనకాముందు చూడను. ఈ ఉద్యోగం నేను దక్కించుకునేందుకు, అదెంతటి నీచకార్యమైనా, అదెంతటి చట్టవిరుద్ధమైనదైనా చేస్తాను, నేను వట్టిచేతుల్తో తిరిగిరాను, ఈ ఉద్యోగం నాది అయితీరాలి...' అని అనుకుని, తనకు


G.E.M

జి. ఇ. ఎం.

స్టార్టర్లు మరియు స్విచ్చులనే

అమర్చండి.

టి. పి. ఐ. సి. స్విచ్చులు :—
15 నుంచి 200 ఆంప్స్ వరకు.

ఇనుము క్లాడ్ స్విచ్చులు,—
15 నుంచి 200 ఆంప్స్ వరకు-ట్రిపిల్ పోల్.
15 నుంచి 30 ఆంప్స్ వరకు-డబుల్ పోల్.
15 నుంచి 30 ఆంప్స్ వరకు-ఛేంజ్ ఓవర్.

★

డి. పి. సి. పుష్ బటన్ స్టార్టర్ :—1 నుంచి 8 ఆంప్స్ వరకు.
డిస్ట్రిబ్యూషన్ బోర్డులు మొదలైనవి



: వివరములకు :

**Ganapathy Engineering Manufacturers (P) Limited**

GANAPATHY, Post Box No. 6 COIMBATORE-641006.
Phone: 23024 : : Tel: "POLESTAR"

వచ్చిన బహుమతి పుస్తకాలు, మెడల్సు, నాన్నగారి వెండిపొడుం డబ్బి, అమ్మ చేతికివున్న వెండి గాజులూ —ఇవన్నీ తెగనమ్మి బయలుదేరాడుతను, ఇంతా చేసి ఇదంతా కలిసి రైలు ఛార్జీలకు, ఖర్చులకు మాత్రమే సరిపోయింది.

★ ★ ★

'...నువ్వే...నువ్వే తీసుంటావ్...మాదర్చోత్... నీ టోపీ, నీ వాలకం చూసినప్పుడే అనుకున్నాను, నువ్వు పరిదొంగముండా కొడుకువని! తియ్...ఎక్కడ పెట్టావో...తొందరగా తియ్...ఊ...' నాయుడు గారు రెచ్చిపోయి మాట్లాడుతున్నారు.

'ఏమిటి నాయుడుగారూ...ఏమైందీ...' అడిగారు ఎదురుగావున్న పట్టబుర్ర పరంధామయ్యగారు.

'ఏమి లేమిటండీ... జేబులో డబ్బు కనిపించడంలేదు, నాకు తెల్సు...వీడే...వీడే తీసుంటాడు...'

'ఎంతేవిటి ?'

'ఎంతేవిటండీ బాబూ...వంద రూపాయల నోటు ...ఇందాక వీడి చెయ్యి నా జేబుకి తగిలిందికూడాను'

'మరైతే అప్పుడే ఎందుకు చెప్పలేదు...'

'బుద్ధి గడ్డితినీ...అందరూ దొంగ వెధవలని ఎలా అనుకుంటామండీ...'

సంభాషణ జరుగుతున్నాయి, ఇన్ని జరుగుతున్నా, ఆ టోపీవాడు, ఈ పడుచుపిల్లా తమకేమీ పట్టనట్టు, ఒకర్నొకరు హాయిగా చూసేసుకుంటూ, తియతియ్యగా కళ్ళతో మాట్లాడేసుకుంటున్నారు.


కథాంజలి
[చక్కని కథల మాస పత్రిక]
స్థాపితం 1938.
విడి ప్రతి ... 40 పైసలు
సంవత్సర చందా ... రూ. 7-50.
(రెండు ప్రత్యేక సంచికలతోసహా)
నేడే చందాదారలుగా చేరండి.
అన్ని హిగ్గిన్ బాథమ్స్ బుక్ స్టాల్సులో
దొరుకును.


నాయుడుగారు నావేపు తిరిగి— 'చూడుబాబూ... ఈ మాయ సచ్చి వాడికి, మన భాష వచ్చినట్లు లేదు, చూడు, ఎలా దిమ్మ చెక్కలా ఓ వులుకూ పలుకూ లేకుండా కూర్చున్నాడో! నువ్వు కాస్త ఆ హిందీలో అడుగు నాయనా...' అన్నాడు.

నేను అడగలేదు. అడగలేకపోయాను, నా కారణాలు నాకువున్నాయి, ఇటూఅటూవున్న ప్రయాణీకులు రకరకాలుగా వాణ్ని, వచ్చీరాని భాషల్లో అడుగుతున్నారు, వాడు రెచ్చిపోయి, తన్నేంత పని చేశాడు.

'అలాకాదు నాయనా...వచ్చే స్టేషన్లో పోలీసులకు రిపోర్టిస్తే సరి. సంకటం కట్టెస్తుంది...' అని నాయుడుగారు అంటూండగా, రైలు తేచుకుంటూ ఆగింది, అది నేను దిగాల్సిన స్టేషన్, బేగ్ పట్టుకుని దిగబోతూంటే, నాయుడుగారు అదేవిటి బాబూ... దిగిపోతున్నారా ?' అన్నాడు.

'నా స్టేషన్ వచ్చిందండీ. అందుకు దిగిపోతున్నాను' అన్నాను, ముందుకు నడుస్తూ.

నాయుడుగారు స్టేషన్ మాస్టర్ కార్యాలయంవేపు నడిచారు రిపోర్టు ఇవ్వడానికి నేను టిక్కెట్టు ఇచ్చి, గేటుబయటకువచ్చాను.

★ ★ ★

పదిహేను రోజుల్లో నాకు ఉద్యోగం దొరికింది. అమ్మ ఆనందం ఏంచెప్పను ?

'మన కష్టాలు తీరాయి నాయనా! ఇన్నాళ్ళకి ఆ దేముడి దయ కలిగింది...దేముడు దయామయుడు బాబూ...' అంది అమ్మ.

ఆ ఆర్డరు చూస్తూంటే నా గుండె దడదడలాడింది. ఆ ఆర్డర్ వెనుక పచ్చ కాగితం రెపరెపలాడింది. అది నా మెరిట్ కి ఇచ్చిన కిరీటం కాదు. నా లంచానికి కట్టిన పట్టం అది.

'దేముడు కాదమ్మా మనపట్లవున్నది! మనపట్లవున్నది ...వున్నది...నాయుడు...నాయుడు...' అని గట్టిగా అరవాలని అనిపించింది నాకు. గానీ, నేను అలా చెయ్యలేను కదా! కారణం...కారణం...నేనో బంది పోటు దొంగని!

★